SANKALPA
A Multidisciplinary Journal of TGTWREIS
Open Access
Review Article

# జనార్దన్ మహర్షి 'వెన్నముద్దలు' పుస్తక సమీక్ష

**Rajkumar M***
*Lecturer, TGTWRDC(B), Karimnagar, Telangana, India*

సినిమా రంగంలో కథారచయితగా, మాటల రచయితగా కొన్ని సినిమాలకు దర్శకునిగా సుప్రసిద్ధులైన జనార్దన్ మహర్షి తనలోని స్వచ్ఛమైన పాలవంటి భావాల నుండి తీసిన కమ్మని కవితలివి. భావాల్ని ఓపిగ్గా చిలికి తీసిన అక్షరాలా.. అక్షరాల 'వెన్నముద్దలు'.

తెలుగు సాహితీ రంగాన ఇప్పుడు ఏ కవితా సంకలనమైనా వ్యాపార దృష్టితో చూస్తే కవికి వెలకట్టరాని నష్టమే. ఇలాంటి నేపథ్యంలో 2003 లో ప్రచురితమైన ఈ పుస్తకం ఇప్పటికి 12 సార్లు పునర్ముద్రణకు నోచుకున్నది. ఇదే ఈ పుస్తకం ప్రజాదరణకు తిరుగు లేని ప్రమాణం.

ఇందులోని కవితలన్నీ నిడివిలో చిన్నవి. కవి అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని సాధించి తీర్చిన, మినీ కవితా సంకలనం ఇది. అయితే కవి ఇందులో ఎక్కడ 'కవిత్వం' అనే మాటనెత్తకుండా పాఠకుల తీర్పుకే వదిలేశాడు.

ఒక ఇంటర్వ్యూలో జనార్దన్ మహర్షి వీటిని వెన్నముద్దలు అనడానికి కారణాన్ని చెబుతూ, వెన్నముద్ద నాలుకపై పెడితే కరిగిపోతుంది. ఇవి అలాంటివే అన్నారు. నిజం! చదవాలనే కొంచెం 'తపన' ఉంటే చాలు, ఆ కాస్త వేడికే కరిగి మన హృదయాలకు చేరే వెన్నముద్దలే ఇవి. ఎలాంటి సంక్లిష్టత, అస్పష్టతలకు తావు లేకుండా, సులువుగా అవగతమయ్యే భావాలివి.

అయితే ఈ 'వెన్నముద్దలు' రుచి విషయంలో మాత్రం షడ్రుచులను కలిగిన రచనలు. ఏ రుచియైన 'వాహ్..' అనిపించే వెన్నముద్ద కమ్మదనాన్ని మాత్రం అందిస్తాయి.

మచ్చుకు రెండు వెన్నముద్దల రుచి చూద్దామా..!

|అత్తా = కోడలు|

మా అమ్మ

మా ఆవిడ

నా రెండు కళ్ళు.

. . . . .

కళ్ళు

ఒక దానినొకటి

చూసుకోవు.

కవి కవిత రెండో సగంలో కళ్ల సహజ లక్షణాన్ని చెప్పాడు. తనకు తల్లీ, భార్యలిద్దరు రెండు కళ్లలాంటి వారని మొదటి సగం లో చెప్పాడు. ఈ రెండు వాక్యాల సమన్వయంతో కవి వ్యంగ్యాన్ని సాధించాడు.

|'గాడ్' ప్రా'మిస్'|

దేవుడి మీద ఒట్టేసి అంతా నిజమే చెబుతా... ఎంత అమృతం తాగితే మాత్రం ఇన్నిఒట్లకి... ఇంకా బతికుంటాడా?

-- కోర్టులలోని సామాన్యమైన దృశ్యాన్ని,

అమృతం తాగిన అమరులకు అన్వయించి కవి ఈ కవితలో అమృతం అనృతం కంటే తక్కువేనని ధ్వనింప జేసి హాస్యాన్ని పండించాడు.

జనార్దన్ మహర్షి కవితలకు పెట్టిన శీర్షికలు కూడ ఆకర్షణీయంగా ఉంటూ, కవితలోని భావాన్ని చిటికెన వేలుపై ఎత్తిచూపుతాయి. పై రెండు కవితల శీర్షికల్లో కవి చూపిన నేర్పు ఈ విషయాన్ని ప్రస్ఫుటం చేస్తుంది.

స్వర్గీయ సినీ గీత రచయిత వేటూరి సుందరామ్మూర్తి ఈ పుస్తకం చదివి, జనార్దన్ మహర్షికి 'జనాకర్షణ మహర్షి' అనే మరొక పేరును స్థిరపరిచారు.

సినీకవి చంద్రబోస్ 'మహర్షి' సాహితీ తపస్సు చేసి బ్రహ్మర్షి అయ్యాడని కితాబునిచ్చారు.

ఇలా జనార్దన్ మహర్షి చేతి వెన్నముద్దలు తెలుగు సాహిత్య పాఠక లోకాన్ని ఆయన్ని చేరి కొలిచేలా చేశాయి.

**Citation**: Rajkumar M. జనార్దన్ మహర్షి 'వెన్నముద్దలు' పుస్తక సమీక్ష. SANKALPA. 2025;1(1):1006.

**© 2025 Rajkumar M.** This is an open access article distributed under the terms of the Creative Commons Attribution License (CC BY 4.0), which permits unrestricted use, distribution, and reproduction in any medium, provided the original author(s) and source are credited.

**Published on:** October 17, 2025

***Corresponding author**: raakumara90@gmail.com